కథాకాలం : అక్టోబరు, 1980

# దక్కని ఒక్క క్షణం

తన పదహారేళ్ళ పరువాన్ని కన్నబిడ్డలా ప్రేమించడం అలవాటు చేసుకుంది లక్ష్మీనరుసు.

ఊరు చివర పాడుపడిన శివాలయం పక్కన ఆ వూరి బుగత గారు దయాధర్మంగా తండ్రికి ఇచ్చిన మట్టరుగుల తాటాకు ఇల్లు చిన్నప్పటినించీ లక్ష్మీనరుసు ప్రపంచం. చచ్చి స్వర్గాన్నో, నరకాన్నో ఉన్న తల్లి గురించిన జ్ఞాపకాలూ, "దీనికి పెళ్ళెలా చేయడం" అని గుడ్లప్పగించి చూసే అరవై యేళ్ళ ముసలి తండ్రి చూపులూ ఆ ఇరుకు ప్రపంచంలో లక్ష్మీనరుసు అనుభూతులు.

అందుచేత ఆమె పరువమే ఒంటరితనంలో ఆమెకి నేస్తం.

ఆ వరువం రోడ్డుమీద ఇతరుల కంటబడడం ఆమెకి ఇష్టం ఉండదు. ఇతరుల కంటబడకుండా పదిలంగా పరువాన్ని దాచుకోడానికి చాలి నంత బట్ట ఆమెకి ఏదీ లేదు.

ఎప్పటివో జాకెట్లన్నీ బిగుతై ఒంటికిపట్టేసి ఉన్నాయి. పదో కుట్టునాటికే రంగు వెలిసిపోయిన పరికిణీలు విముక్తి దొరకని వెట్టి కూలీల్లా ఆమెకింకా సేవచేస్తున్నాయి.

శారీరక సంపద ఉన్న వాళ్ళు పేదవాళ్ళయితే గుమ్మం దాటడం ఎంత కష్టం?

ఆమెకి తెలిసినంతవరకూ పేదరికం అంటే-రెండైనా వోణీలు లేకపోవడం.

ఆమె తండ్రి చైనులుకి తెలిసినంతవరకూ పేదరికం అంటే-ఆయవారం చేసుకుని పోగేసుకున్న బియ్యంలోంచి రూపాయిల్ని పిండి కూతురికి రెండైనా వోణీలు కొనలేకపోవడం.

ఓ సారి ఓ చిత్రం జరిగింది.

అయవారం చేసుకుని ఇంటికొచ్చిన చైనులు అరుస్తూ బైట ఎండలో పది నిమిషాలు మాడినా ఇంటితలుపులు తెరుచుకోలేదు.

కూతురు లోపల ఏదో తప్పు చేస్తోందన్న అనుమానం చిన్నగా మొదలై అడయార్ పట వృక్షమంత ఎదిగి చైనులు ఎదలోపలి మధ్య తరగతి మనిషికి పరువు మర్యాదల్ని గుర్తుచేసింది. చైనులుబలంగా తలుపుల్ని కాలితో తన్నాడు. లోపల గడియ ఫెళ్ళున విరిగింది. ఊపుకి తూలి నేలమీద వడ్డాడు. ఒక మూల నగ్నంగా ముడుచుకుని

కూర్చొని ఉంది లక్ష్మినరుసు.

"ఉన్నది ఒకటే జత బట్టలు. అవి తడిపి ఆరేశాను. అందుకే తలుపు వేసుకుని ఇలా...."

అంతే!

సైనులు స్పృహతప్పాడు. అరగంటకి అతను స్పృహలోకి వచ్చేలోగా ఆరిన బట్టలు కట్టుకుని లక్ష్మినరుసు అతనికి పేద వైద్యం చేస్తోంది. (పేద వైద్యం అంటే - టాక్సీ మాట్లాడి ఆ చుట్టుపక్కల ఆసుపత్రులలోకెల్ల మేలైన కొంచెం ఖరీదైన ఆసుపత్రిని ఎంచి హుటాహుటిన ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చేర్పించడానికి బదులుగా, రోగి తలను కాలిపై పెట్టుకుని విసినకర్రతో విసురుతూ, కన్నీళ్ళు కార్చుతూ దేవుని ప్రార్థించడం.)

స్పృహలోకి వచ్చిన తరువాత సైనులు నెల తిరిగేలోగా నీకు ఇంకో జతబట్ట కొంటానమ్మా అని కూతురికి కాంభోజరాగంలో వాగ్దానం చేశాడు.

అన్నమాట ప్రకారం నెల తిరక్కుండా కూతురికి పరికిణీ, వోణీ, జాకెట్టూ కొనిచ్చాడు.

ఆ కొత్త జత బట్టలు చూసి లక్ష్మినరుసు ఆనందభైరవిలో నవ్విందో, ఏడ్చిందో తెలియదు. నాన్న నాకింక పెళ్ళెం చైగల్లు అని మాత్రం అనుకుంది.

ఆ రోజు హోరున వాన.

పండితప్పేటకీ, రాయపురానికీ మధ్య పొలాలలో మోకాటిలోతు నీళ్ళలో చిక్కడిపోయాడు సైనులు చేతిలో కలశంతో.

మట్టరుగుల తాటాకు ఇంట్లో లక్ష్మీనరుసు బిక్కుబిక్కుమంటూ బిక్కడిపోయింది.

ఆ ఇంటి పక్క పాడుబడ్డ శివాలయంలో గంట గాలికూగుతూ గణగణ శబ్దం చేస్తోంది.

ఆకాశాన్ని కమ్మేసిన దట్టమైన మేఘం లోకంమీద చీకటి గుమ్మరిస్తోంది పట్టపగలే.

తడిక తీసి తండ్రి జాడ కోసం పరికించి చూసింది లక్ష్మీనరుసు.

యాభై గజాల దూరంలో నల్లటి ఓ మనిషి ఆకారం ఆ ఇంటి దిశగా కదులుతూ వస్తోంది. అతను తైనులు కాడు. లక్ష్మీనరుసు తడిక బిగించి గోడకు ఆనుకుని కూర్చొంది. ఇంటి కప్పు మీంచి వర్షపు ధారలు నేలని చిల్లులు పొడుస్తూ కురుస్తున్నాయి. ప్రళయ ప్రకృతి వంక నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయింది లక్ష్మీనరుసు.

అంతలో ఆమె గుండె ఝల్లుమంది.

తటాలున తడిక తెరుచుకుంది.

చాకులాంటి ఓ కుర్రాడు లోపలికి దూసుకువచ్చాడు.

నల్లగా, సన్నగా కండలు తిరిగి ఉన్నాడు. పక్కటెముకల దగ్గర కండలు పేర్చినట్టున్నాయి. ఛాతీ దర్పంగా పొంగిఉంది. పొట్ట బిర్రబిగుతుగా డప్పులా ఉంది. చలిలో రెండు భుజాల్నీ అరచేతులలో కప్పుకుని లక్ష్మీనరుసు వంక చురుగ్గా చూశాడు వాడు.

ఆ చూపు తనకు ఇదివరకు పరిచయంలాగే తోచింది లక్ష్మీనరుసుకి.

ఆఁ గుర్తుకొచ్చింది.

కాలవ రేవుదగ్గర ఓ సారి తన కాళ్ళముందు హృదయం పారేసు కున్నాడు వీడు. అప్పుడు రేవులో బిందెతో మంచినీళ్లు పడుతున్నదల్లా తలెత్తి వీడికేసి చూసి యవ్వనానికి అర్థం తెలుసుకుంది తను.

వీడు రేవుకి కొంచెం దూరంలో నీటిలో బుడుంగున మునిగి, అట్టే పైకి తేలుతూ తన విద్యలు చూపించాడు. "ఏయ్ పిల్లా. నా తానంకానీ నేనెల్లిపోయిం తరవాత నీళ్ళట్టుకో" అని చొరవగా అన్నాడు. ఎందు కన్నట్టు చూసింది తను. "రేవుకాడ నాను తానవాడతంటే బేపనోల్లు నీళ్ళట్టుకోరు. మైల పడతయ్యంట" అన్నాడు వాడు నీళ్ళతో ఆడి ఆడి అలసిపోయి రొప్పుతూ.

"జీవధారకి మైలలేదు" అంది తను. ఆ మాట వాడికి అర్థం కాదని తెలుసు. వాడు మాత్రం పెద్ద అర్థమయినట్టు పక పక విరగబాటుగా నవ్వాడు.

అదిగో వాడు వీడేలా ఉంది.

"బైట వాన .... వరస వంటే వరసం. కుండ పోతలా కురిసేస్తంది. కుంచేపు ఇక్కడ కూకుని ఎల్లిపోతాను" అన్నాడు వాడు.

ఆ కంఠంలో జీర.

వర్షంలో తడిసిన శరీరం నిగనిగ లాడుతోంది. అటువైపు తిరిగి మొలగుడ్డ పిండుకుంటున్నాడు. వాడి వీపు మీంచి నీటిచుక్కలు జర్రున జారి కిందపడుతున్నాయి.

ప్రకృతి తాండవానికి భయపడుతూంటే సమయానికి కొండంత

అందలా వచ్చిన వాడికేసి కృతజ్ఞతా పూర్వకంగా చూసింది లక్ష్మీనరుసు.

వాడు ఇల్లంతా కలతిరిగి జర్మన్ సిల్వర్ గిన్నెలు వర్షం ధారగా కురుస్తున్న చోట ఉంచి "అగ్గిపెట్టె ఏదుంది?" అని అడిగాడు.

నరుసు కళ్లప్పగించి చూస్తూ కూచుంది ఏమీ మాట్లాడకుండా.

వాడే గూట్లో వెతికి అగ్గిపెట్టె బైటికి తీసి పుల్లలలో నెంబుకోనిది ఏరి దానితో దీపం వెలిగించాడు.

గాలికి దీపం ఆరిపోతుంటే దానికి అడ్డు నిలబడ్డాడు.

నరుసు గోడవార చలికి ముడుచుకు కూర్చుంది.

చలి మరిచిపోవడం కోసం వాడు పాట ఎత్తుకున్నాడు. పెదాలు అదురుతుండడంతో పాట సారిగా బైటికి రాలేదు.

"చాలా చిత్రమైన మనిషి" అనుకుంది లక్ష్మీనరుసు.

ఇంట్లోకి ధైర్యంగాజొరబడి అంతవరకూ తన చుట్టూ ఆవరించివున్న భయాన్ని పటాపంచలుచేసి ధైర్యపు దీపం వెలిగించిన ఆ మనిషిమీద లక్ష్మీనరుసుకి అదోరకం కుతూహలం కలిగింది.

"నీదేం పేరు?" అని అడిగింది.

ఎక్కడో ఉరుము ఉరిమింది.

వాడు చెప్పినది వినపడలేదు. మళ్ళా అడిగింది.

"ఈరిగాణ్ణి"

వాడు చెప్పిన తీరుకి లక్ష్మీనరుసుకి నవ్వొచ్చింది.

"ఆయారం బాపనాయన లేడేంటి?" అని అడిగాడు.

"తప్పు. మా నాన్న పేరు చైన్లు"

"ఏమో మరి అంతా ఆయారం బేపనాయన అంటారని అలా అన్నాను"

లక్ష్మినరుసు చలికి మరింత ముడుచుకుపోతే ఆ పక్కన పడి ఉన్న తడిసీ తడవని చిరుగుల తాటాకు బుట్టతీసి "సలి కాచుకుందామా!" అన్నాడు.

కళ్ళతో ఊఁ అంది లక్ష్మినరుసు.

"అన్నట్టు నీపేరేంటి?" అన్నాడు బుట్టకి అగ్గిపుల్ల గీస్తూ. బుట్ట తడికి ఆరిపోబోయి మళ్ళీ నిలదొక్కుకుని చిటపటమంటూ వెలిగింది. ఆ వెలుగు వాడి నల్లటి ముఖంమీద బంగారపు రంగు పులిమింది. కళ్లు మెరిసాయి.

ఆ కళ్ళకేసి చూస్తుంటే తన పేరు చెప్పబుద్ధివేసి 'లక్షినరుసు' అంది. అలా అంటూ తడినేలమీద చూపుడు వేలుతో తన పేరు రాసింది.

"నీకు సదువు ఒచ్చా?" అన్నాడు వాడు మొహంమీద మొహంపెట్టి కుతూహలంగా కళ్ళలోకి చూస్తూ. చలిమంటకన్నా వేడిగా ఉందా చూపు లక్ష్మినరుసుకి.

"వచ్చు" అంది.

"ఐతే నా పేరు రాయ్"

"నీ పేరు సరిగ్గా చెప్పు"

"ఈరిగాణ్ణి"

"అదికాదు. సరిగ్గా చెప్పాలి"

"ఈరిగాణ్ణే"

"నీ తలకాయ"

"ఏమైంది" తల తడుముకున్నాడు వాడు.

లక్ష్మీనరుసు ఫక్కున నవ్వింది.

"నీకు నాపేరు తెలిసిందోస్" అన్నాడు వాడు గొప్పగా.

"పోన్లే. నన్ను విసిగించకు" అంది లక్ష్మీనరుసు. బుట్ట ఖాడిదయి పోతోంది.

మంట తగ్గుతుంటే చలి మరీ ఎక్కువవుతోంది.

"నీకోకోపమొచ్చిందా?" తను విసుక్కున్నందుకు చిన్న బుచ్చు కున్నట్టు అడిగాడు.

లక్ష్మీనరుసు మనసు చివుక్కుమంది. చూపులతో వాడిని మళ్ళా తూకం వేసింది.

ఆ ఇంటికి దగ్గరగా పిడుగు పడ్డట్టు ఆకాశం ఫెళ ఫెళ మంది.

లక్ష్మీనరసు కెవ్వున అరిచింది.

మరు క్షణంలో ఇద్దరి మధ్యాదూరాన్ని ప్రళయ ప్రకృతి చెరిపేసింది.

ఆ యింటి బైట ప్రకృతి వికృత రూపం దాల్చితే, ఆ ఇంటి లోపల

ప్రకృతి తన సహజ నైజం చూపెట్టబోయింది.

వాళ్ళిద్దరూ అలా ఉండిపోయారు.

ఈ క్షణం బాగుంది అనుకున్నారు పదే పదే. అంతకు మించి ఆ క్షణాన్ని ఏం చేసుకోవాలో తెలియలేదు.

క్షణిక సుఖంలా చలిమంట ఆరిపోయింది.

అంతలో లక్ష్మినరసు మరో పిడుగు నెత్తిమీద పడ్డట్లు ... పోయింది.

వాడి చెయ్యి విదిల్చి కొట్టి దూరంగా జరిగి "పో వెధవా" అంది.

వాడికేమీ తెలియలేదు. "నే నేం చేశాను" అన్నట్టు చూశాడు.

''పో బైటకి ముందు. అసలు నిన్నెవరు రమ్మన్నారు?"

''బైట వర్షం....'' ఈరిగాడు నసిగాడు.

"వర్షమైతే నేనేం చేయను? మా ఇంట్లో వీలుపడదు. ఎక్కడి కన్నా పో...."

వాడు అలా నిలబడి జాలిజాలిగా చూశాడు ఐదు నిమిషాలు. ఐదు నిమిషాలూ లక్ష్మినరుసు గుండెలమీద చేతులు పెట్టుకుని రొప్పుతూ నిలబడింది.

వాడు ఉన్నట్లుండి తడిక తోసుకుని ఆ వర్షంలో జొరబడి వెళ్ళిపోయాడు.

ఆఖరిక్షణంలో ఒకసారి మళ్ళీ ఒంటరితనపు భయంతో "కాస్సేపు ఆగు, వెళ్ళిపోకులే" అని చెబుదామనుకుంది లక్ష్మినరుసు. నోరు పెగల

లేదు. తడికె సందులోంచి చూసింది. బురదలో పెద్ద పెద్ద అంగలేసు కుంటూ ఏదో గట్టిగా గొంతెత్తి పాడుకుంటూ వెళ్ళిపోతున్నాడు వాడు. తాను చప్పట్లుకొట్టి పిలిచినా వినపడదు వాడికి.

మళ్ళీ నిస్సహాయంగా గోడకి చేరగిలబడింది. అప్పుడు గమ ింది. తన కొత్తవోణి ఒంటిమీదలేదు. మట్టినేలమీద తడిలో పడి శ్రీలక్ష్మికి తానేదో తప్పు చేసినట్టనిపించింది - చలిలో వాణ్ణి సుకోవడంకాదు - వర్షంలో బైటకి గెంటైడం!

ఆ రాత్రే చైన్లు చెప్పాడు "పాలకొల్లులో ముప్పయేళ్ళ వంట బ్రాహ్మడు తిరపతిలో వచ్చే శుక్కురారంనాడు నిన్ను పాణిగ్రహణం చేస్తాడే అమ్మాయీ!" అనే సారాంశం ఉన్న ఉపన్యాసం.

ఆ వచ్చే శుక్కురారం వచ్చింతరవాత తిరపతిలో బాజాల్లేని మంత్రాల పెళ్ళి అయ్యింతరవాత మూడు నెలలకి తెలిసింది లక్ష్మి నరసుకి - తనని తండ్రి మూడు వందల రూపాయలకి అమ్మేశాడని.

భోరున విలపిస్తూ నేలమీద కూలిపోలేదు లక్ష్మినరుసు.

"ఈ విషయం వానపడ్డ రోజున ముందే తెలిస్తే ఈరిగాణ్ణి "పో వెధవా" అంటూ గెంటేదాన్ని కాదు. జీవితంలో ఒక్కటైనా మధురక్షణాన్ని నా సొంతం చేసుకొనేదాన్ని" అని మాత్రం కించిత్తు విచారంగా అనుకుంది.